కథ

# కిటికీ

- విజయ కుమారి





అప్పుడే ఆఫీసు నీంచి వచ్చాడు రంగనాథరావు. వరండాలో జోళ్ళు విడిచి గదిలోకి అడుగుపెట్టాడు. గుప్పున వచ్చింది చుట్టవాసన. మొహం చిట్లించుకుని ప్రక్కకి చూశాడు. కిటికీ తలుపులు బార్లా తీసు న్నాయి. వళ్ళు మండిపోయే దృశ్యం అటుప్రక్క..

పాక బయట నులకమంచం మీద కూర్చుని అరవై ఏళ్ళ సింహాచెలం, వాడి మూడోపెళ్లాం వద్దెనిమిదేళ్ల పైడమ్మ చుట్టలు కాలుస్తూ కబుర్లాడుకుం టున్నారు. చిర్రెత్తుకొచ్చింది రంగనాథరావుకి.

"వనజా!" గావుకేక పెట్టాడు కోపంగా.

"ఏమైందిటా! ఎందుకా గావుకేకలు?" సాగదీసుకుంటూ వచ్చింది వన జాక్షి.

"ఆ కిటికీ తలుపులు మూసి వుంచమని నీకెన్ని సార్లు చెప్పాను!" మండి పడ్డాడతను.

"గాలీ వెళ్తురూ రాకుండా తలుపులు మూసుకోడం కుదరదని నేనూ చెప్పాను చాలా సార్లు..." అదే స్థాయిలో జవాబిచ్చింది వనజాక్షి.

"నీ వ్యవహారం నాకేం నచ్చలేదు." తీవ్రంగా చూశాడామె వైపు.

"నేననేదీ అదే, ప్రతిరోజూ ఏమిటీ గొడవ! ఎవడో వుల్లయ్య చుట్ట కాల్చా డని, ఎల్లయ్య బీడీ కాల్చాడని మనం తలుపులు బిగించుకు కూర్చోవాలంటే ఎలా కుదురుతుందీ అని అడుగుతున్నాను." నిలదీసింది వనిజాక్షి. ఎంతైనా లాయరు కూతురు మరి.

ఎడ్డెమంటే తెడ్డెమనే పెళ్ళాన్ని చూస్తుంటే కంపరం పుట్టుకొచ్చిం దతనికి. "దీని తిక్క ఎలా కుదర్చాలో తెలియకుండా వుంది" మన స్సులోనే కుతకుతలాడిపోతూ బర్రున కుర్చీ లాక్కుని అందులో కూలబడ్డాడు.

ఆ కిటికీ తలుపులు మూసే విషయంలో రోజూ వాగ్వివాదం మామూలయిపోయింది ఇద్దరికీ. అది మూసి వుంచినందువల్ల వన జాక్షి కేం ఇబ్బందిలేదుగాని భర్త చెప్పినదానికి తలవంచాలా? అదీ వంతం.

కిటికీకి అటు ప్రక్క ఖాళీ స్థలంలో కొన్ని తాటాకు పాకలు న్నాయి. వీళ్ల కిటికీ ఎదురుగా వున్న పాక సింహాచెలానిది. దేవుడు నోరిచ్చింది అడ్డపొగ పీల్చడానికి, వటవట వాగడానికి అన్నట్లు పొద్ద స్తమానూ చుట్టలు కాలుస్తూ తుపుకూతుపూకూ ఊసుకుంటూ నానా కంగాళీ చేస్తుంటారిద్దరూ. ఆ వాసన పీల్చలేకా, ఆ దృశ్యాలు చూడలేకా కిటికీ తలు పులు వెయ్యమంటాడతను. "చాల్లెండి ఎవరైనా వింటే నవ్వుతారు" అంటూ అతని మాటలు కొట్టిపారేస్తుంది వనజాక్షి.

ఈ సమస్యకి విరుగుడేమిటిట!?

ప్రొద్దెక్కిలేచిన రంగనాథరావు ఆఫీసుకెళ్లే హడావుడిలో గబగబా షేవ్ చేసుకుంటూ అనుకోకుండా కిటికీ వైపు చూశాడు. అంతే, మెరుపులాంటి ఆలోచన.

"వనజా!" సౌమ్యంగా పిలిచాడు భార్యని.

"అవతల పోపు మాడిపోతోంది ఏం కావాలిట?" రుసరుసలాడుతూ వచ్చింది వనజాక్షి.

"అబ్బే ఏంలేదు; నీ పాతజాకెట్లు వుంటే పైడమ్మకిస్తావేమొనని..."

చట్టుక్కున కిటికీవైపు దృష్టి సారించిందామె. రవికలు వేసుకునే అలవాటు లేని పైడమ్మ తీరిగ్గా కూర్చుని రెండుచేతులూ పైకెత్తి కొప్పుచుట్టుకొం టోంది. అరచేయంత అద్దంలో రకరకాలుగా చూసుకుంటూ.

భళ్లున తలుపులు మూసి విసురుగా వెళ్లింది వంటగదిలోకి వనజాక్షి. ఆ తర్వాత కిటికీ తలుపులు తెరచి వుండగా ఎవరూ చూడలేదు.

■